ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



నాకు పేద, ధనిక తేడా లేదు

- నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి
- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



మాట్లాడుతున్న రఘురామ

కాళ్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): 'వీలైతే ఉండి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని అడ్డుపడవద్దని, తనకు 'పేద, ధనిక తేడా లేదు' అని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పెదఅమిరంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామ్రేడ్స్- ప్రజా శ్రేయస్సు దృష్ట్యా కాలువ గట్లపై ఆక్రమణలను తొలగిస్తుంటే అడ్డగోలుగా మాట్లాడడం సరికాదని, పంట, మురుగు కాలువలపై ఆక్రమించిన వారిని వదిలిపెట్టేదే లేదన్నారు. అన్నివర్గాల వారి ఆక్రమణలు తొలగించామన్నారు. తాగునీరు కలుషితం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని కాలువ గట్లపై ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టామన్నారు. ఇటువంటి వాటికి కోర్టు కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాయని ఆ మేరకే తొలగింపులు చేస్తున్నామన్నారు. ఆకివీడు, కాళ్ళ, ఉండి, పాలకోడేరు ప్రాంతాల్లో ఇప్పటికే చాలా ఆక్రమణలు తొలగించామన్నారు. ఇటీవల పాలకోడేరు రాశి కాలువ గట్టుపై ఆక్రమణల ఇళ్లను కోర్టు తీర్పు ప్రకారం తొలగించారని, తాను ఏ పనిచేసినా కోర్టు ఆదేశాల మేరకే చేస్తున్నానని స్పష్టం చేశారు. తాను భేషరతుగా క్షమాపణ చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ 30 రోజుల సమయం ఇస్తున్నానని వార్నింగ్ ఇవ్వడంతో కౌంటర్ ఇచ్చానన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఆయన ఈవిధంగా మాట్లాడడం సబబా అని ప్రశ్నించారు. అతను ఎవరో తనకు తెలియదని, ఆయన పేరు వినలేదన్నారు. వివాదానికి ఆద్యుడైన అతనే క్షమాపణ చెప్పాలన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి బీవీ రాఘవులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో తనకు పరిచయం ఉందన్నారు. మరో పదిహేను రోజుల్లో కోర్టు ఆర్డర్‌తో మిగిలిన ఆక్రమణలు తొలగిస్తానని స్పష్టం చేశారు. ప్రజలు సంపూర్ణ ఆమోదంతో ఆక్రమణల ఇళ్లను తొలగిస్తున్నామని, తనకు, ప్రజలకు మంచి సంబంధం ఉందన్నారు. కామ్రేడ్స్. ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే తన దృష్టికి తీసుకురండి. తొలగించకపోతే ఆరోపణలు చెయ్యండి అని కోరారు.



విజ్జేశ్వరం

స్వచ్ఛ జలం

వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు కదలిక

- రూ.1,428 కోట్లతో అన్ని గ్రామాల్లో మంచినీటికి ప్రభుత్వం నిర్ణయం
- మెగా ఇంజనీరింగ్ సంస్థకు పనులు
- శరవేగంగా క్షేత్రస్థాయిలో సర్వే
- విజ్జేశ్వరం వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్
- పైప్‌లైన్ మార్గాల్లో సర్వే చేపడుతున్న ఏజన్సీ
- త్వరలో పైపులకు ఇండెంట్‌లు
- వైసీపీ పాలనలో ముందుకు సాగని పనులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పల్లె ప్రజలకు స్వచ్ఛమైన గోదావరి జలాలు అందనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ అమలుకు చర్యలు తీసుకున్నారు. మెగా ఇంజనీరింగ్ సంస్థ పనులు దక్కించుకుంది. విజ్జేశ్వరం వద్ద నీటి శుద్ధి ప్లాంట్‌ను నిర్మించనున్నారు. అక్కడ నుంచి జిల్లాలోని అన్ని గ్రామాలకు నేరుగా స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తారు. గ్రావిటీ ఆధారంగా ఓవర్‌హెడ్ రిజర్వాయర్ ట్యాంక్‌ల్లోకి విజ్జేశ్వరం వద్ద ఏర్పాటు చేసే ట్రీట్‌మెంట్ ప్లాంట్‌నుంచి నీరు చేరిపోనుంది. అలాకాని పక్షంలో సంపుల్లోకి నీటిని మళ్లిస్తారు, అక్కడ నుంచి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లోకి నీటిని ఎక్కిస్తారు. ఇలాంటి ప్రణాళికలతో గ్రామీణ నీటి పారుదల శాఖ ప్రాజెక్ట్‌కు సన్నాహాలు చేసుకుంటోంది. విజ్జేశ్వరం నుంచి గ్రావిటీతో నీరు సరఫరా అయ్యే మార్గాలను సర్వే చేస్తున్నారు. త్వరలోనే పైపులకు ఇండెంట్‌లు పెట్టనున్నారు. మొత్తంపైన రూ.1,428 కోట్లతో జిల్లాలోని అన్ని గ్రామాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. వాస్తవానికి గత తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలోనే వాటర్ గ్రిడ్‌కు బీజం పడింది. అప్పట్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మొత్తానికి మంచినీటిని సరఫరా చేసేలా రూ.3,600 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్ట్ స్థాయిని కుదించారు. పశ్చిమ జిల్లా వరకే రూ.1,428 కోట్లతో పనులు చేపట్టేలా ప్రణాళిక చేశారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి పనులు ప్రారంభింపచేశారు. కానీ పనులు మాత్రం ముందుకు సాగలేదు. సర్వేకూడా పూర్తి చేయలేకపోయారు. మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటర్‌గ్రిడ్‌పై దృష్టి పెట్టారు. శరవేగంగా క్షేత్రస్థాయిలో సర్వే పనులు నిర్వహిస్తున్నారు. త్వరలోనే పైపులకు ఇండెంట్‌లు పెట్టనున్నారు.

రెండో దశ ప్రాజెక్ట్‌కు ప్రతిపాదన

తొలి దశలో పశ్చిమ గోదావరి జిల్లాలోని గ్రామాలకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఉంగుటూరు మండలంలోని కొన్ని గ్రామాలకు మాత్రమే విజ్జేశ్వరం నుంచి నీరు అందనుంది, దీంతో ఏలూరు జిల్లా పరిధిలోని పలు గ్రామాలు, నరసాపురం తీర ప్రాంతంలో ఇంకొన్ని గ్రామాలకు కలిపేలా రెండోదశ ప్రాజెక్ట్‌కు ఇప్పుడు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు. అందుకోసం మరో రూ.1400 కోట్లు వెచ్చించనున్నారు. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే రూ.1,428 కోట్లతో చేపట్టే తొలిదశ వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్‌ను అందుబాటులోకి తేనున్నారు. అదే జరిగితే స్వచ్ఛమైన గోదావరి జలాలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం కొనుగోలు చేసే మంచినీటిపైనే జనం ఆధారపడుతున్నారు. తాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. ప్రతి ఏటా కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. గోదావరి జలాలను ఇంటి అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. వాటర్‌గ్రిడ్ అమల్లోకి వస్తే గోదావరి జలాలు తాగునీటి అవసరాలకు ఉపయోగించుకోనున్నారు.



పైపు లైన్లు (ఫైల్)



ఆహా ఆవకాయ

• పచ్చళ్ల సీజన్ వచ్చేసింది !

- నిలకడగా మిరపకాయల ధరలు
- దిగిరాని నూనె ధరలు

తాడేపల్లిగూడెం మార్కెట్‌లో పచ్చడి మామిడి కాయల జోరు

ఆహా ఏమి రుచి, అనరా మైమరచి.. వేసవి కాలం వచ్చిందంటే చాలు ప్రతీ ఒక్కరికి గుర్తుకు వచ్చేది కొత్త ఆవకాయ పచ్చడి. చూస్తే చాలు నోట్లో నీళ్లు ఊరతాయి. వేడి వేడి అన్నంలో కొత్త ఆవకాయ పచ్చడి, కొంచెం నెయ్యి వేసుకుని తిన్నామంటే ఆ రుచే వేరు. ప్రస్తుతం వేసవి కాలం రావడంతో తాడేపల్లిగూడెం ఆదివారం మార్కెట్‌లో అమ్మకానికి పచ్చడి మామిడి కాయలు అధిక మొత్తంలో వచ్చాయి. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

పెంటపాడు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) :

రోజుకు పది టన్నుల కాయ దిగుబడి

ప్రస్తుతం తాడేపల్లిగూడెంలో పచ్చడి మామిడి కాయలు ప్రతీ రోజు సుమారు పది టన్నుల ఉత్పత్తి అవుతోంది. తూర్పుగోదావరి జిల్లా నుంచే అధికంగా ఆయా రకాలకు చెందిన మామిడి కాయలు దిగుమతి అవుతున్నాయి. పచ్చడి అంటే ఒక్క ఆవకాయ మాత్రమే కాదు.. అనేక రకాలు ఉంటాయి. ఆవకాయ, మాగాయ, ఉల్లి మాగాయ ఇలా అనేక రకాలైన పచ్చళ్లు పట్టుకునేందుకు ఈ మామిడి కాయలే ఉపయోగపడతాయి. ప్రస్తుతం వేసవి ప్రారంభ దశలో ఉండడం, వాతావరణంలో ప్రతీరోజు మార్పులు రావడంతో ప్రస్తుతం పచ్చళ్ల సీజన్ ఇంకా ఊపందుకోలేదు.

మార్కెట్‌లో పలు రకాల మామిడి కాయలు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో పచ్చడి పట్టుకునే ముఖ్యమైన రకాలకు ధరలు, కాయ నాణ్యతను బట్టి అమ్మకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా కొత్తపల్లి కొబ్బరికాయ రూ.20-25, బిజర్లు రూ.20-25, పెద్ద రసాలు రూ.20-25, చిన్నరసాలు రూ.15-20, సువర్ణరేఖ రూ.20-25, దేశవాళి రూ.10-15 వరకు ధరలు పలుకుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పచ్చడి మామిడికాయల ధరలు చాలావరకు తగ్గాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ మామిడి ధరలు స్థిరం కాదని వచ్చే వారానికి ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

నిలకడగా మిరపకాయ ధరలు

పచ్చడిలో ఉపయోగించే మిరపకాయ ధరలు ప్రస్తుతం నిలకడగానే కొనసాగుతున్నాయి. పచ్చడికి ఉపయోగించే మిరపకాయలు రకాలను బట్టి కేజీ రూ.300 నుంచి రూ.350 వరకు పలుకుతున్నాయి. కూరకు ఉపయోగించే మిరపకాయలు రూ.190 నుంచి రూ.275 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఇక పచ్చడిలో వేసే ఆవాలు (ఆవపిండి), మెంతులు, వెల్లుల్లి పాయలు, ఉప్పు ధరలు నిలకడగానే ఉన్నాయి.

దిగిరాని వంటనూనె ధరలు

పచ్చళ్ల ప్రియులకు వంటనూనె ధరలు మాత్రమే కాసింత ఇబ్బంది పెడుతున్నాయి. గత ఏడాది పెరిగిన వంటనూనె ధరలు నేటికీ దిగిరాలేదు. ఇప్పటికీ అదే తీరులో కొనసాగుతున్నాయి. రూ.1500 ఉండే ఫ్రీడం ఆయిల్ డబ్బా ప్రస్తుతం రూ.2,250లకు చేరింది. మిగిలిన నూనె ధరలు ఏమాత్రం తగ్గలేదు. పచ్చడి పట్టుకునే వారికి నూనె ధరలే తలనొప్పిగా మారాయి. మిగిలిన ధరలన్నీ అందుబాటులో ఉండడంతో పచ్చళ్ల సీజన్ ఈ ఏడాది కూడా యథావిధిగానే కొనసాగనుంది.



తాడేపల్లిగూడెం మార్కెట్‌లో..

మామిడి ధరలు బాగా తగ్గాయి



గత ఏడాదితో పోలిస్తే ఈసారి మామిడి ధరలు బాగా తగ్గాయి. ఇంకా అమ్మకాలు జోరందుకోలేదు. వచ్చే ఆదివారానికి అమ్మకాల జోరు అందుకుంటాయని భావిస్తున్నాం. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా చాలామంది పచ్చడి పట్టుకునేం దుకు ముందుకు రావడం లేదు. అమావాస్య వెళ్లిపోయింది. కాబట్టి ఎండలు ఇంకా ముదిరితే వ్యాపారాలు జోరందుకునే అవకాశం ఉంది.

- సీహెచ్. బన్ను మామిడికాయల వ్యాపారి



చేపల చెరువు గట్టుకు గండి కొట్టిన దృశ్యం

చేపల చెరువులకు గండి కొట్టడంతో నీట మునిగిన వరిచేలు

మా రికార్డులు.. మాకున్నాయి!

సరిహద్దులు చూపకుండానే చేపల చెరువులకు గండ్లు!

- వరి చేలల్లోకి చేరిన చెరువుల నీరు
- ఫారెస్టు అధికారుల ఒంటెద్దు పోకడలు
- లంచం ఇస్తేనే సాగు.. ధోరణిలో కక్ష సాధింపు : బాధిత చెరువుల రైతులు
- పంట నష్టపోయాం.. న్యాయం చేయాలి : వరి రైతుల ఆవేదన

నిడమర్రు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : లంచం ఇస్తేనే చెరువులు సాగు చేయాలనే ధోరణితో తమను భయభ్రాంతులను చేసి దోచుకోవడమే లక్ష్యంగా కొల్లేరులో ఫారెస్టు అధికారులు వ్యవహరిస్తున్నారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఓ పక్క కొల్లేరులో వాస్తవ పరిస్థితులను పరిశీలించడానికి సాధికారిక కమిటీ పర్యటన ఖరారవుతున్న నేపథ్యంలో ఫారెస్టు అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శిస్తున్నారు. తమ భూమి సర్వే నిమిత్తం స్థానిక సచివాలయంలో కొలతలకు దరఖాస్తు చేసుకున్నారు. మే 3వ తారీకున సర్వే చేస్తామని అధికారులు తెలి పారు. అయినా ఇవేవీ పట్టించుకోకుండా 'మా రికార్డులు.. మాకున్నాయి' అంటూ ఏకపక్ష ధోరణితో రైతులపై కక్ష సాధింపు ధోరణిని ప్రదర్శించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఫారెస్టు అధికారుల అనాలోచిన చర్య వల్ల తాము నష్టపోయా మంటూ వరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించి బాధిత రైతులు తెలిపిన వివరాలివి.. నిడమర్రు మండలం పెదనింద్రకొలను - నిడమర్రు శివారు కొల్లేరు సరిహద్దు ప్రాంతంలో 16 ఎకరాల విస్తీర్ణంలోని రెండు చేపల చెరువులకు శనివారం ఫారెస్టు అధికారులు ఇరువైపులా గండ్లు కొట్టారు. అయితే చెరువుల్లో మా జిరాయితీ భూములు ఉన్నాయని, సర్వేకు దరఖాస్తు చేశామని విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోలేదని, సరిహద్దులు చూపకుండానే గండ్లు కొట్టేశారని బాధిత రైతులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు గండి కొట్టిన చెరువుల నుంచి నీరు సుమారు కిలోమీటరు దూరంలోని కోతకు సిద్ధమైన వరిచేలల్లో మోకాలు లోతు నిలిచింది. దీంతో ఏడెకరాల వరిపొలం పూర్తిగా నీటమునిగింది. సుమారు 8 లక్షల రూపాయల విలువైన పంట నష్టపోయామని, దీనికి బాధ్యత ఎవరిదని బాధిత వరి రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై డీఎఫ్‌వో బి.విజయలక్ష్మి వివరణ ఇస్తూ

- మిగతా 8లో

కొల్లేరు ఫారెస్టు అధికారుల తీరుపై గతంలో 'లంచం ఇస్తేనే సాగు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేకం కథనం వచ్చింది. దీనిపై విచారణ అనంతరం స్థానిక అటవీశాఖ అధికారిని సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలోనే రైతులపై కక్ష సాధింపు ధోరణితో కొల్లేరు ఫారెస్టు అధికారులు వ్యవహరిస్తూ చెరువుల రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

మాకు న్యాయం చేయాలి



మాది చిన్న కుటుంబం. కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాం. పంట కోతకోసే సమయంలో నీటిముంపు వల్ల చేలో మోకాలు లోతు నీళ్ల వచ్చాయి. అటవీ శాఖ అధికారులు ఎవరికీ చెప్పకుండా పంటబోదెలోకి నీరు వదలడం వల్ల మా పంట తీవ్రంగా నష్టం పోయాం.. మాకు న్యాయం చేయాలి.

- చెన్నుబోయిన సుబ్బాయమ్మ, మహిళా రైతు, పెదనింద్రకొలను



ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్

- గ్రామాల్లో ఒకచోట ప్యానల్స్ వేసి విద్యుత్ సరఫరాకు చర్యలు
- జిల్లాలో 250 ఎకరాలు అవసరమని ఏపీఈపీడీసీఎల్ అధికారుల అంచనా

గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీల గృహాల్లో సోలార్ వెలుగులు విరజిమ్మనున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ స్థానంలో వారికి పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఉచితంగా ప్యానల్స్ వేసి విద్యుత్ సౌకర్యం అందించాలని నిర్ణయించింది. జిల్లాలో 51,500 మందికి ఈ అవకాశం అందనుంది.

భీమవరంటౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలోను 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్ పొందుతున్న ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగా పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్‌ను అందించేందుకు నిర్ణయించింది. వీరి ఇంటికి అనువైన స్థలం ఉంటే నేరుగా ప్యానల్స్ ఏర్పాటుచేసి విద్యుత్‌ను అందించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆవిధంగా స్థలాలు అనుకూలం లేనిచోట్ల పంచాయతీల స్థలాలను గుర్తించి అక్కడ వంద కిలో వాట్స్ సంబంధించి ప్యానల్స్ ఏర్పాటు చేసి అక్కడ నుంచి లబ్ధిదారులకు ఉచిత విద్యుత్‌ను అందించేలా చర్యలు చేపడుతోంది. ఈమేరకు ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఆదేశాలు అందాయి. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ విద్యుత్‌కు సంబంధించి నియమ నిబంధనలు రావాల్సి ఉంది.

గ్రామాల వారీగా స్థలాల గుర్తింపు

ఏపీఈపీడీసీఎల్ అధికారులు గ్రామాల్లో స్థలాలను గుర్తించే పనుల్లో ఉన్నారు. గ్రామాలకు దగ్గరగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ఉన్న ఖాళీలతోపాటు స్థలాలను గుర్తించే పనిలో ఉన్నారు. జిల్లా మొత్తం మీద సోలార్ విద్యుత్ అందించేందుకు దాదాపు 250 ఎకరాలు అవసరంగా అంచనావేస్తున్నారు.

జిల్లాలో 51,500 కనెక్షన్లు

జిల్లాలో 200 యూనిట్లు ఉచితంగా పొందుతున్న ఎస్సీ, ఎస్టీలు 51,500 కనెక్షన్లు ఉన్నాయి. దీనిలో 48వేలు ఎస్సీలు కాగా ఎస్టీలు 3,600 కనెక్షన్లు ఉన్నాయి. వీటి ఆధారంగానే సోలార్ విద్యుత్‌ను అందించేలా చర్యలు చేపడుతున్నారు. వీరిలో స్థలం ఉండి ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటే వారు విద్యుత్ శాఖ అధికారులను సంప్రదిస్తే కనెక్షన్లు అందించే అవకాశం ఉంది.

160 ఎకరాలు గుర్తించాం

ఎస్సీ, ఎస్టీలకు సోలార్ విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల వారీగా అనుకూలమైన స్థలాలను గుర్తించామని దీనికి సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్ నాగరాణికి అందిస్తాం. ఇప్పటి వరకు 160 ఎకరాల వరకు గుర్తించాం.

- ఆలపాటి రఘునాథబాబు, ఎస్ఈ

హాస్టళ్లలో 4,130 సీట్లు ఖాళీ

- జిల్లాలోని 64 బీసీ, ఎస్సీ హాస్టళ్లలో 3,270 మంది మాత్రమే వినియోగం

మా పిల్లలు బాగా చదవాలంటే ఏదైనా హాస్టల్‌లో సీటు దొరికితే బాగుండు. ఇంటి దగ్గర సరిగా చదడవడంలేదు. ప్రభుత్వ హాస్టళ్లలో చేర్చాలంటే రికమండేషన్ కావాలి. మాకు రికమండేషన్ ఎవరు చెబుతారు. ఇది గతంలో హాస్టళ్లకు ఉన్న డిమాండ్. కానీ ప్రస్తుతం హాస్టళ్లలో సీట్లన్నీ సగానికి సగం ఖాళీ. జిల్లాలో బీసీ, ఎస్సీ వెల్ఫేర్ వసతి గృహాలు 64 ఉండగా 4,130 ఖాళీలతో వసతి గృహాలు నిర్వహిస్తున్నారు. హాస్టళ్లలో విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. హాస్టళ్లలో ప్రస్తుత పరిస్థితిపై ఆంధ్రజ్యోతి కథనం.

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అన్నిచోట్లా లభించడంతోపాటు మధ్యాహ్న భోజనం, ఉచితంగా యూనిఫారం, బ్యాగ్స్, పుస్తకాలు అందించడంతో పూర్వం సీట్ల కోసం ఎగబడిన వసతిగృహాలు ఇప్పుడు ప్రాభవం కోల్పోయాయి. ఈ మేరకు వసతి గృహాల్లో పిల్లల్ని చేర్పించేందుకు అధికారులు డ్రైవ్‌లు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అధికంగా అద్దె భవనాల్లోనే..

ప్రభుత్వ హాస్టళ్ల బీసీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్ భవనాలు అధికంగా అద్దె భవనాల్లోనే సాగుతున్నాయి. బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ జిల్లాలో 29 ఉండగా 19 అద్దె భవనాలు, ఎస్సీ హాస్టల్స్ 35కు గాను 11 అద్దె భవనాల్లోనే ఉన్నాయి. ఇక విద్యార్థులు బీసీ హాస్టళ్లలో 3900మంది విద్యార్థులు ఉండేందుకు అవకాశం ఉండగా 1800 మంది వసతి పొందుతున్నారు. అంటే 2100 ఖాళీలు ఉన్నాయి. అదేవిధంగా ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లలో 3500 మంది ఉండేందుకు వీలుండగా 1,470 మంది మాత్రమే వినియోగించుకోగా 2,030 ఖాళీలు ఉన్నాయి.

విద్యార్థుల కోసం స్పెషల్ క్యాంపులు

బీసీ, ఎస్సీ హాస్టళ్లలో విద్యార్థులను చేర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. హాస్టళ్ల సమీప గ్రామాలు, పట్టణాల్లో వెల్ఫేర్ ఉద్యోగులు మే రెండో వారం నుంచి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి హాస్టళ్లలో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి చేర్పిస్తారు.



తాడేపల్లిగూడెంలో బీసీ హాస్టల్

హాస్టళ్ల మరమ్మతులకు నిధులు

గత వైసీపీ ప్రభుత్వంలో నిరాదరణకు గురైన హాస్టళ్లకు పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రస్తుత ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. దీనిలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్ల భవనాల మరమ్మతులకు రూ.1.29 కోట్ల నిధులు విడుదల చేశారు. ఈ నిధులతో ఇప్పటికే జిల్లాలో హాస్టళ్ల మరమ్మతు పనులు 70శాతం పూర్తికావస్తున్నాయి.



ఆంధ్రజ్యోతి గ్రూపు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ సతీమణి శ్రీమతి వేమూరి కనకదుర్గ చతుర్థ వర్ధంతి సందర్భంగా ఆదివారం తాడేపల్లిగూడెం యూనిట్ కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రాంచ్ మేనేజర్ బి.హరిబాబు, యాడ్స్ మేనేజర్ గోపాలకృష్ణంరాజు, వివిధ విభాగాల సిబ్బంది ఆమె ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.

మంత్రి రామానాయుడు శ్రమదానం

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు మండలం చింతపర్రు అరుంధతీ పేటలో ఆదివారం జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ స్లాబ్ నిర్మాణ పనుల్లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శ్రమదానం చేశారు. మంత్రి నిమ్మల స్వయంగా కంకర ఎత్తి మిల్లర్‌లో పోశారు. స్లాబ్ పైకి ఎక్కి కాంక్రీట్ పనులు చేశారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ స్లాబ్ నిర్మాణ పనులు గత అంబేడ్కర్ జయంతి రోజున ప్రారంభించారు. ఆ రోజున కూడా ఐరన్ బిగించే పనుల్లో శ్రమదానం చేశారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని, తన తండ్రి ధర్మారావు పేరిట ధర్మారావు ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో మహనీయులు అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలన్నిటికీ స్లాబ్ నిర్మాణాలను దశల వారీగా పూర్తి చేస్తానన్నారు. సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, సవరపు వెంకటేశ్వరరావు, సవరపు నాని బాబు, కొండేటి గాంధీ తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లు మండలం చింతపర్రు అరుంధతి పేటలో అంబేడ్కర్ విగ్రహ స్లాబ్ నిర్మాణ పనుల్లో మంత్రి నిమ్మల..



మంత్రి రవీంద్రకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న ప్రధానార్చకుడు

చిన వెంకన్నను దర్శించుకున్న మంత్రి రవీంద్ర

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామిని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దర్శించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, మాజీ మంత్రి పీతల సుజాతలతో ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం బంగారువాకిలి నుంచి ప్రవేశించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు. డిప్యూటీ ఈవో బాబూరావు ఆయనకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. రాష్ట్ర అంగన్వాడీ విభాగం అధ్యక్షురాలు ఆచంట సునీత, లంకా సత్య న్నారాయణ, పోలిన శ్రీను, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, పాకలపాటి గాంధి, జడ్పీటీసీ శామ్యూల్, మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి, మద్రాస్ రాము, నాదెళ్ల సురేంద్ర నాథ్ చౌదరి, మొగతడకల శ్రీనివాసరావు, ఏపూరి దాలయ్య, మాసిరెడ్డి హరిబాబు, ఇమ్మడి రత్నాజీ, నాదెళ్ల వెంకటేశ్వరరావు, దేవరపల్లి హేమంత్, తదితరులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల ఆలయ ప్రాంగణంలో సాధారణ భక్తుల రద్దీ

శ్రీవారి క్షేత్రంలో అమావాస్య ఎఫెక్ట్

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : చినవెంకన్న క్షేత్రానికి అమావాస్య ప్రభావం కనిపించింది. సెలవు కావడంతో ఆదివారం ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఈ ఆదివారం అమావాస్య కావడంతో వందల సంఖ్యలోనే భక్తులు వచ్చారు. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలలో సాధారణ రద్దీ కన్పించింది. దేవస్థానం, ప్రైవేటు పాన్సీ దుకాణాలు మధ్యాహ్నానికి మూత పడ్డాయి. వైశాఖ మాసం ప్రారంభం కానుండటంతో సోమవారం నుంచి రద్దీ పెరగవచ్చని అధికారులు భావిస్తున్నారు.



అమ్మవారి అభిషేకం కోసం కలశాలతో నదీ జలాలను తీసుకు వెళ్తున్న మహిళలు

పెంటపాడులో గౌరీదేవికి ప్రత్యేక పూజలు

పెంటపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పెంటపాడు గౌరీదేవి అమ్మవారి ఆలయ పునః నిర్మాణం చేసి 40 రోజులు అయిన సందర్భంగా వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కలశాలతో 108 మంది మహిళలు నదీ జలాలను తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకాలు చేశారు. భారీ అన్నసమారాధన చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద హోమ పూజలు నిర్వహించారు. వెలమ యువజన సంఘం సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డీఎస్సీ అభ్యర్థుల ఇక్కట్లు



- స్టడీ సర్టిఫికెట్ల కోసం పాట్లు
- పాఠశాలల చుట్టూ ప్రదక్షిణలు
- స్కూళ్లకు వేసవి సెలవులు
- దొరకని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు
- ఉన్నతాధికారులే పరిష్కారం చూపాలి

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ- 2025 రిక్రూట్‌మెంట్‌కు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు స్టడీ సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులనెదుర్కొంటున్నారు. కీలకమైన ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఉన్నట్టు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేటపుడు మిగతా ధ్రువీకరణ పత్రాలతో పాటే 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లను కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉండటం, ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో గతంలో తాము చదివిన పాఠశాలల నుంచి స్టడీ సర్టిఫికెట్లను పొందేందుకు ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎం/ టీచర్లు అందుబాటులో ఉండక పోవడంతో తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నట్టు అభ్యర్థులు వాపోతు న్నారు. ఈ క్రమంలో డీఎస్సీ పరీక్షకు చదువుకు నేందుకు విలువైన సమయాన్ని కోల్పోవడమే గాక, రోజుల తరబడి స్టడీ సర్టిఫికెట్ల కోసం పాఠశాలల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారే లేరని ఆందోళన చెందుతున్నారు. డీఎస్సీకి దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ప్రారంభం కాగా, వచ్చేనెల 15న ముగియనుంది. ఈలోగా వేసవి సెలవులు ముగిసే అవకాశం లేకపోవడంతో స్టడీ సర్టిఫికెట్లను పొందడానికి స్కూలు హెచ్‌ఎంలను, ఉపాధ్యాయులను ఫోన్లలో సంప్రదిస్తూ అభ్యర్థిస్తుండటం మినహా ప్రత్యామ్నాయం కనబడటం లేదని చెబుతున్నారు.

30 ఏళ్ల నాటి సర్టిఫికెట్ల కోసం వెతుకులాట



డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థుల వయో పరిమితిని 44 ఏళ్లకు పెంచిన విషయం విదితమే. ఆ ప్రకారం సంబంధిత వయసు గల అభ్యర్థులు సుమారు 9 ఏళ్ల వయసులో 4వ తరగతి చదువుతారని అంచనా. దీనికనుగుణంగానే సుమారు 35 సంవత్సరాల క్రితం ప్రాథమిక పాఠశాలల్లో చదివిన 4వ తరగతి మొదలుకుని ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతివరకు స్టడీ సర్టిఫికెట్లను ఆయా పాఠశాలల నుంచి తీసుకుని డీఎస్సీ దరఖాస్తు సమయంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల స్థానికతను నిర్ధారిం చేందుకు 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన పాఠశాలల్లో జారీచేసిన స్టడీ సర్టిఫికెట్లనే ప్రామాణికంగా తీసుకుంటారన్న విషయం తెలిసిందే. ఈ ధ్రువపత్రాల ప్రకారమే అభ్యర్థుల లోకల్, నాన్‌లోకల్ స్టేటస్‌ను ఉద్యోగ ఎంపికల్లో నిర్ణయిస్తారు. ఈ నేపథ్యంలో దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం నుంచి తాము చదువుకున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ఆయా తరగతులకు స్టడీ సర్టిఫికెట్లను పొందడానికి ఇపుడు స్కూళ్లకు వేసవి సెలవులు పెద్ద ఆటంకంగా మారాయని అభ్యర్థులు చెబుతున్నారు.

ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే సమస్యకు పరిష్కారం

డీఎస్సీ, ఇతర ఉద్యోగ నియామకాల పోటీ పరీక్షలకు అవసరమైన అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలపై అవగాహన, ముందస్తు ఏర్పాట్లు చేసుకున్న అభ్యర్థులను మినహాయిస్తే, వీటిని ఇంతవరకు సమకూర్చుకోలేనివారే ఇపుడు ఆందోళన చెందుతున్నారు. ఈ కోవలో స్టడీ సర్టిఫికెట్ల సమస్య కీలకంగా మారింది. టెన్త్ పరీక్షలు ఫెయిలైన విద్యార్థులకు ప్రస్తుతం హైస్కూళ్ల రెమిడియల్ క్లాసులు నిర్వహిస్తుండటంతో హెచ్‌ఎంలు అందుబాటులో ఉంటున్నందున స్టడీ సర్టిఫికెట్లను పొందేందుకు డీఎస్సీ అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తడం లేదని తెలుస్తోంది. దీనికి భిన్నమైన పరిస్థితులు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నెలకొన్నాయి. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఈ పాఠశాలలు మూసి ఉంటున్నాయి.స్టడీ సర్టిఫికెట్లు జారీచేయాలంటే అభ్యర్థులు ఆయా సంవత్సరాల్లో చదివిన తరగతుల రికార్డులు, రిజిస్టర్లను స్కూలు ప్రధానోపాధ్యాయుడు, బోధన, బోధనేతర సిబ్బంది పరిశీలించి, ధ్రువీ కరించుకున్న తర్వాతే హెచ్‌ఎం సంతకం చేసి ఇవ్వాల్సి ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు తాళాలు వేసి ఉంటున్నాయని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో తాము గతంలో చదువుకున్న పాఠశాలల నుంచి స్టడీ సర్టిఫికెట్లను పొందే దుకు వివిధ జిల్లాలు, ప్రాంతాల్లో ఉంటున్నవారు వ్యయ ప్రయాసల కోర్చి తమ పూర్వపు పాఠశాలలకు వస్తుండగా, అక్కడ ఎవరూ అందుబాటులో ఉండకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. స్కూలు హెచ్‌ఎం, టీచర్లకు ఫోన్ చేసి సర్టిఫికెట్ల కోసం అభ్యర్థిస్తున్నారు. మెగా డీఎస్సీకి రాష్ట్రంలో లక్షల సంఖ్యలోనే అభ్యర్థులు పోటీ పడతారన్న అంచనాలున్న నేపథ్యంలో దరఖాస్తుకు అవసరమైన స్టడీ సర్టిఫికెట్ల కోసం ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రభుత్వం పరిష్కారం చూపాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ సమస్యను డీఈవో వెంకట లక్ష్మమ్మ దృష్టికి తీసుకెళ్లగా 'ఇది కీలకమైన సమస్యే. వేసవి సెలవుల్లో రెమిడియల్ క్లాసులను తీసుకోవడానికి పాఠశాలలకు టీచర్లను రమ్మంటే ఎర్న్ లీవులను అడుగుతున్నారు. డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ సర్టిఫికెట్లను జారీ చేసేందుకు ఎదురవుతున్న సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరించే ప్రయత్నం చేస్తా' అని వివరించారు.

త్వరలో నంది నాటకోత్సవాలు నిర్వహిస్తాం

- రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- భీమవరంలో ముగిసిన చైతన్య భారతి సాంఘిక నాటకోత్సవాలు



ఆత్మీయ పురస్కారాలు అందుకుంటున్న డాక్టర్ పి.కృష్ణంరాజు, బాలాజీ నాయక్

భీమవరం అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మార్పుకు నాటకాలు ఎంతో దోహదపడతాయని, నాటకరంగాన్ని బతికించడానికి పరిషత్‌లు చేస్తున్న కృషి ఎనలేనిదని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో జరుగుతున్న చైతన్య భారతి 18వ జాతీయ స్థాయి సాంఘిక నాటకోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మంత్రి దుర్గేష్ హాజరై మాట్లాడారు. గత ఐదేళ్లలో కళాకరులకు ఎటువంటి పురస్కారాలు లేవని, కళా వ్యవస్థను నాశనం చేశారన్నారు. త్వరలోనే నంది పురస్కారాలను, నంది నాటకాలను నిర్వహిస్తామన్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాను రాజమండ్రిలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరామన్నారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేకపోయినా 18 సంవత్సరాలుగా ప్రతీ ఏడాది నాటకోత్సవాలు నిర్వహిస్తున్న చైతన్య భారతి కృషి ఎనలేదన్నారు.త్వరలోనే భీమవరంలో ఒపెన్ ఆడిటోరియం నిర్మించేలా సహకరిస్తామన్నారు. అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ నాటకాలకు ప్రేక్షకుల ఆదరణ తగ్గిందని కళాకారులకు పోత్సాహం అందించాలన్నారు. ముందుగా ఈ నాటిక పోటీలను ఆలపాటి తులసీ వెంకటరమణ, బోగిరెడ్డి హనుమాన్, తాడిమళ్ళ రామనరసింహంలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం హైదరాబాదు కేర్ హస్పటల్ ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ కృష్ణంరాజుకు చైతన్యభారతి ఆత్మీయ పురస్కారం, తోలేరు సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ అధ్యక్షులు చవాకుల సత్యనారాయణకు రాయప్రోలు రామచంద్రమూర్తి రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటుడు రచయిత ప్రయోక్త బాలాజీ నాయక్‌కు పెనుపోతుల శేషగిరిరావు రంగస్థల చైతన్య పురస్కారం ప్రదానం చేశారు. మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు,నాటక పరిషత్ వ్యవస్థపక అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాస్, బోండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణవర్మ, కర్రెడ్డి సత్యనారాయణ, వడుపు గోపిలు పాల్గొన్నారు. నాటికల న్యాయ నిర్ణేతలుగా నాగభూషణం (గుంటూరు), రుద్రమూర్తి (భిలాయి), మానాపురం సత్యనారాయణ వ్యవహరించారు.

ఆలోచింపజేసిన నాటికలు

పోటీల్లో భాగంగా ప్రదర్శించిన రెండు నాటికలు ప్రేక్షులను అలరించాయి. దాంపత్య జీవితంలో దంపతుల మధ్య అభిప్రాయ బేధాలు, అపోహలు, చిన్న చిన్న సమస్యలు తలెత్తటం లాంటివి సహజం. తొందరపాటుతో పంతాలకు పోయి విడాకులు కావాలనుకోవడం సమంజసం కాదని..భారతీయ వివాహ వ్యవస్థలో మన సంస్కృతీ, సంప్రదాయాలే సంసార జీవితాలను అన్యోన్యంగా నడిపే దారిదీపాలు అని తెలియజేసిన నాటిక అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి 'విడాకులు కావాలి' ఆలోచింపజేసింది.

సామాన్యులు ఖర్చు తక్కువని జనరల్ బోగిలో ప్రయాణించటానికి ఇష్టడతారు. రైల్వే జనరల్ బోగీలు తగ్గించేయడంతో జనరల్ బోగీలన్నీ కిక్కిరిసి ఉంటున్నాయి. జనరల్ బోగి ప్రయాణికుల పరిస్థితి, ఇబ్బందులను కళ్లకు కట్టినట్టు తెలిపిన శ్రీ సాయి ఆర్ట్స్ గుంటురు వారి 'జనరల్ బోగీలు' అందరినీ అలరించింది.

కొంతేరులో ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

యలమంచిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి మండలం కొంతేరులో యూత్‌క్లబ్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 43వ అఖిల భారతస్థాయి నాటిక పోటీల్లో మూడో రోజు ఆదివారం ప్రదర్శించిన శ్రీసౌజన్య కళాస్రవంతి ఉత్తరాంధ్ర వారి 'దేవరాగం', శ్రీనటీనట సంక్షేమ సమాఖ్య పాలకొల్లు వారి 'అనూహ్యం' నాటికలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. మానవ జీవితంలో అన్ని బంధాలకన్నా జన్మనిచ్చిన బంధం బలమైనది.. ఈ బంధం విచ్ఛిన్నమైతే తల్లిదండ్రులకు వృద్ధాప్యం శాపమవుతుంది.. వారిని విడవకుండా కంటికిరెప్పలా కనిపెట్టుకుని ఉండే ఆ వృద్ధాప్యమే ఆ తల్లిదండ్రులకు మలిదశలో మధురమైన బాల్యం అవుతుందన్న కథాంశంతో 'దేవరాగం' నాటిక ప్రదర్శించారు. తల్లిదండ్రుల ఆస్తి కోసం కుటిలవ్యూహాలతో అనునిత్యం మోసం చేస్తున్న కన్న కొడుకులకు తగిన గుణపాఠం చెప్పాలంటే ప్రతి తల్లీ, తండ్రీ అనూహ్యమైన వ్యూహాలతో ముందుకు సాగాలని, కొడుకులు వారసత్వ సంపదను అనుభవించడం కోసం బిచ్చగాళ్లలా ఎదురుచూడకుండా స్వయంకృషితో,ఆత్మాభిమానంతో జీవించాలనే సందేశంతో 'అనూహ్యం' నాటిక ప్రదర్శించారు.



స్థిరంగా కూరగాయ ధరలు

పెంటపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం మార్కెట్‌లో కూరగాయల ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఆదివారం మార్కెట్‌లో ధరలు ఇలా ఉన్నాయి. కేజీ టమాట రూ.20, బీరకాయలు కేజీ రూ.40, దొండకాయలు రూ.30, తెల్ల వంకాయలు రూ.50, నల్ల వంకాయలు రూ.40, అల్లం రూ.60, క్యాబేజి రూ.30 , బీట్‌రూట్ రూ.30 , బీన్స్ రూ.80, కాప్సికం రూ.60 , ఉల్లిపాయలు 5 కేజీలు రూ.100, పచ్చి మిరపకాయలు రూ.40, దోసకాయలు రూ.30, మునగకాయలు 4 రూ.20, అనపకాయ ఒక్కటి రూ.15, , అరిటి కాయలు 3 రూ.20 చొప్పున విక్రయించారు.



తీరంలో సందర్శకుల సందడి

పేరుపాలెం తీరంలో సందర్శకుల తాకిడితో సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడం, పగలంతా ఎండ, ఉక్కబోతలతో సతమతమైన పలువురు కుటుంబ సమేతంగా పేరుపాలెం సాగర తీరానికి చేరుకుని సేదతీరారు. ఇక్కడ చల్లని గాలులు ఆస్వాదిస్తూ సముద్ర స్నానం చేసి ఉల్లాసంగా గడిపారు. తీరంలో కొబ్బరి, సరుగుడు తోటల్లో సరదాగా తిరిగారు.

- మొగల్తూరు (ఆంధ్రజ్యోతి)

అనారోగ్యం తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య

లింగపాలెం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం గ్రామానికి చెందిన చుంచులేటి పార్వతి (26) గత కొంతకాలంలా అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆ బాధ భరించలేక ఆదివారం ఉదయం ఆమె భర్త చికెన్ సెంటర్‌కు వెళ్లిన సమయంలో ఇంటిలో ఉరి వేసుకుందని తెలిపారు. కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు గమనించి లింగపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని చెప్పారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ధర్మాజీగూడెం ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య



టి.నర్సాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్ర జ్యోతి): ఫ్యాన్‌కు ఉరి వేసుకుని యువకుడు ఆత్మ హత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వల్లంపట్ల పంచాయతీలోని తిరుపతిపాడుకి చెందిన సుల కాని పూర్ణసాయి పవన్ (22) పదో తరగతి వరకు చదివి వ్యవసాయ పనులు చేసుకుంటు న్నాడు. ప్రతీరోజు రాత్రి ఇంటికి ఆలస్యంగా వస్తు న్నాడని తండ్రి సిద్ధిరాజు మంద లించటంతో మన స్థాపానికి గురైన సాయిపవన్ ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. తల్లిజ్యోతి ఫిర్యాదుతో ఎస్‌ఐ జయ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాటిచెట్టును ఢీకొని యువకుడి మృతి

మొగల్తూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కేపీ పాలెం బీచ్ రోడ్డులో శనివారం అర్ధరాత్రి బైక్‌పై వెళుతున్న ఒక యువకుడు రోడ్డుపక్కన గల తాటిచెట్టును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వీరవాసరానికి చెందిన మల్లుల నాని (20), అతని మిత్రుడు గుడాల హేమంత్ సాయి బైక్‌పై వెళుతూ కేపీ పాలెం తీరంలో తాడిచెట్టును ఢీకొట్టారు. బైక్ నడుపుతున్న నాని ఘటనా స్థలంలోనే మృతి చెందగా హేమంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు తండ్రి మల్లుల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వాసు తెలిపారు.

క్రైం కార్నర్

గోస్తనీ నదిలో గుర్తు తెలియని మృతదేహం

పాలకోడేరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మోగల్లులోని గోస్తనీ నది వంతెన వద్ద విస్సాకోడేరు పరిధిలో నదిలో గుర్తుతెలియని వ్యక్తి (40) మృతదేహాన్ని గుర్తించారు. విస్సాకోడేరు వీఆర్వో పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి వర్మ తెలిపారు. మొగల్లు వెళ్లే గోస్తనీనది వంతెన వద్ద విస్సాకోడేరు పరిధి వైపు ప్రవహించే కాలువలో మృతదేహం ఉండటాన్ని గుర్తించి ఆ మృతదేహాన్ని బయటకు వెలికి తీశారు. బ్లూ రంగు ఫాంటు, రంగు రంగుల షర్టు ధరించాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలు

పెనుమంట్ర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పెను మంట్ర మండలం వెలగలవారిపాలెం గ్రామం దగ్గరలో మోటారు సైకిల్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో మోటార్ సైక్లిస్టు తలకు తీవ్ర గాయాలయ్యాయి. నిడదవోలు మండలం కాట కోటేశ్వరం గ్రామానికి చెందిన జుత్తిగ శ్రీరాములు (45) తన కుమారునితో కలసి వీరవా సరం మండలం మడుగు పోలవరం గ్రామంలో తమ బంధువుల ఇంటికి మోటారు సైకిల్‌పై వెళుతున్నాడు. వెలగలవారిపాలెం వద్ద పడిపోవడంతో స్థానికులు వెంటనే స్పందించి పెనుమంట్ర అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. 108 సంఘటన స్థలానికి చేరుకొని ఈఎంటీ బాలకృష్ణ, పైలట్ మహేష్ సహకారంతో క్షతగాత్రునికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం తణుకు ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు.

వివాహితను గాయపరిచిన వారిపై కేసు నమోదు

ఉండి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వివాహితను గాయపరిచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఉండి ఎస్‌ఐ మహమ్మద్ నజీరుల్లా తెలిపారు. ఉండిమండలం పెదపుల్లేరు గ్రామంలో గ్రామానికి చెందిన కర్రి సాయి లక్ష్మీ తన ఇల్లు దెబ్బతినడంతో దానిని విప్పి వేయించింది. అదే ప్రాంతానికి చెందిన రాయి శ్రీను, మరో ఇరువురు ఇంటి హక్కుల గురించి అడిగి గొడవ పడ్డారు. రాయి శ్రీను ఆమెను ఇను పరాడ్డుతో కొట్టి గాయిపరిచాడు. ఆమె భీమవరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంది. ఆదివారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యర్రాయి చెరువులో కొనసాగుతున్న పోలీస్ పికెట్

తణుకు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :తణుకు రూరల్ మండలం,ఇరగవరం మండలం పరిదిలోని యర్రాయి చెరువు గ్రామాల్లో నెల కొన్న ఉద్రిక్త పరిస్థితుల్లో పోలీసులు ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్ ఆదివారం కూడా కొనసాగింది. తణుకు రూరల్ మండలం యర్రాయి చెరువు గ్రామస్తులు గ్రామ పరిధిలోని ఉమ్మడి చెరువు గట్టుపై ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటును ఇరగవరం మండల పరిధిలోని యర్రాయి చెరువు గ్రామస్తులు అడ్డుకోవడంతో ఏర్పడిన ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో రెండు గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ సమస్య పరిష్కారానికి అందరూ సహకరించాలని పెద్దలను కోరుతున్నారు.



ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల లగేజీలను తనిఖీలు చేస్తున్న జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు

ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల భద్రత దృష్ట్యా గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు ఉమ్మడిగా ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రైల్వే డీఐజీ సత్య ఏసుబాబు, రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆదేశాలతో విజయవాడ రైల్వే డీఎస్పీ రత్న రాజు, రైల్వే సీఐ దుర్గారావులు ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌కు వచ్చారు. జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి ప్లాట్‌ఫామ్స్‌లోని ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేశారు. వెయిటింగ్ హాల్స్, బుకింగ్ కౌంటర్లు, రిజర్వేషన్ కౌంటర్లు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పలు ప్రయాణికులను ఎక్కడ నుంచి ఎక్కడికి వెళ్తున్నారో వివరాలను తెలుసుకున్నారు.

నేడు కాళీపట్నం భూ సమస్యపై గ్రామ సభ

మొగల్తూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కాళీపట్నం రెవెన్యూ గ్రామంలో జమీందార్, ఎస్టేట్ భూముల సమస్యలకు సంబంధించి సోమవారం గ్రామ సభ నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భూములకు సంబంధించి జేసీ, సెటిల్‌మెంట్ అధికారి రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జగన్నాథపురం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 2.30 గంటలకు గ్రామ సభ జరుగుతుందని, కాళీపట్నం రెవెన్యూ పరిధిలోని ఆరు గ్రామాల రైతులు పాల్గొనాల్సిందిగా తహసీల్దార్ కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పెనుమంట్ర, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం10 గంటల నుండి పెనుమంట్ర తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కారం వేదిక నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ వై రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమనికి మండలంలో అన్ని శాఖల అధికార్లు హాజరవుతారని ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కరిస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వై. రవికుమార్ కోరారు.

బెట్టింగ్ రాయుళ్ల గగ్గోలు

వైసీపీ నాయకుడి పెట్రోల్ బంక్ వద్ద ఆందోళన?

పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పట్టణానికి చెందిన ఒక వైసీపీ నాయకుడు, అతని సోదరుడిపై ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని పోలీసులు ఇటీవల కేసు నమోదు చేయడం.. వారు పరారీలో ఉండటం విదితమే. ఈ నేపథ్యంలో వారి వద్ద క్రికెట్ బెట్టింగ్ ఆడే పంటర్లు బెట్టింగ్ యాప్‌లో తాము డిపాజిట్ చేసి సొమ్ముతోపాటూ, తాము గెలిచిన సొమ్ము ఇప్పటివరకూ ఇవ్వకపోవడంతో సదరు ఆ వైసీపీ నాయకుడి నిర్వహణలో ఉన్న పెట్రోలు బంక్ వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నాలుగురోజుల క్రితం పంటర్లు ఈ ఆందోళన చేసినట్లు సమాచారం. బెట్టింగ్ నేరం కావడంతో, భారీ మొత్తంలో సొమ్ములు పోయినా ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని పంటర్లు వాపోతున్నారు.

మార్కెట్ పాటపై వీడని సస్పెన్స్

నరసాపురం టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ మార్కెట్ పాటపై నెలకొన్న సస్పెన్స్ ఇంకా వీడలేదు, పది రోజుల క్రితం మార్కెట్ పాటను ఆమోదించాలా.. లేదా అన్న నిర్ణయాన్ని కౌన్సిల్ ప్రభుత్వ నిర్ణయానికే విడిచి పెట్టింది. అయితే ఇంత వరకు దీనిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఈ పరిస్థితుల్లో మార్కెట్ పన్నును మునిసిపల్ సిబ్బందే వసూలు చేస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పాట ప్రారంభ ధరను రూ. 72 లక్షలుగా నిర్ణయించారు. ఇప్పటివరకు ఆరు సార్లు పాట పెట్టారు. రెండో సారి రూ. 30లక్షలకు పాడారు. అయితే నిర్ధేశించిన ధర కంటే రూ. 50లక్షలు తక్కువగా ఉండటంతో ప్రభుత్వం ఆమోదించలేదు. ఆ తరువాత ఎవరూ పాడలేదు. ఆరో సారి రూ. 45 లక్షలకు భూపతి సురేష్ పాడారు. ఇది కూడా నిర్ధేశించిన దర కంటే రూ. 27 లక్షలు తక్కువ, అయితే ఈ పాటను కౌన్సిల్ ఆమోదించలేదు. ప్రభుత్వానికే నిర్ణయాధికారం ఇచ్చింది. ఇంకా ఆమోదం రాకపోవడంతో ఈ ఏడాది పాటపై సస్పెన్స్ నెలకొంది.

శిక్షణ తరగతులు వినియోగించుకోవాలి : సరళాదేవి



తణుకు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రీడర్స్ ఫోరం, గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు జరిగే వేసవి శిక్షణా తరగతులను వినియోగించుకోవాలని రీడర్స్ ఫోరం అధ్యక్షురాలు వావిలాల సరళాదేవి అన్నారు. ఆదివారం పురుషుల శాఖా గ్రంథాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ శిక్షణ తరగతులు సోమవారం ఉదయం 8 గంటలకు రాజీవ్ గాంధీ మున్సిపల్ కాంప్లెక్స్‌లో గల గ్రంథాలయంలో జరుగుతాయని, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు శాఖా గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ శిక్షణ ఉంటుందని కథలు వినడం, చెప్పడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్‌పై శిక్షణ ఇస్తారని తెలిపారు.

మేడేను ఘనంగా జరుపుకోవాలి : కోనాల

తణుకు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎనిమిది గంటల పనిహక్కు పరిరక్షణా దినోత్సవంగా కార్మికులు మేడేను ఘనంగా జరుపుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు అన్నారు. ఆదివారం తణుకు అక్కమాంబ టెక్స్‌టైల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన యూనియన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడే సందర్భంగా అన్ని కార్మిక సంఘాలు అరుణ పతాకాలు ఆవిష్కరించి ర్యాలీలు, సభలు నిర్వహించి మేడే ఉద్యమ పోరాట చరిత్ర వివరించాలన్నారు. మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జరిగే ర్యాలీకి ఉద్యోగ, కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ మండల అధ్యక్షుడు ఆదినారాయణబాబు, కార్యదర్శి గుబ్బల గోపి కోరారు. ఆదివారం సివిల్ సప్లయ్ గోదాము వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు మానవత, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉల్లంపర్రులో మాంటిస్సోరీస్ డాక్టర్ సబిత కాలేజీలో ఆదివారం మద్దాల రాంప్రసాద్, వాసుల ఆర్థిక సాయంతో మహిళలకు ఉచిత కాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. పేర్లు నమోదు చేయించుకున్న 226 మందికి పాలకొల్లు విజయ ల్యాబ్ సిబ్బంది బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ కుసుమ ప్రశాంతి (పాథాలజీ) కాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 112 మందికి మణిపాల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి బృందం బస్సులో ఏర్పాటు చేసిన అధునాతన పరికరాలతో కాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. రోటరీ క్లబ్ సభ్యులు, మానవత సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 50 వేలు అందజేత



విరాళం అందిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మావుళ్ళమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన అడపా రామకృష్ణ, పార్వతీ దంపతులు రూ. 50 వేలు విరాళంగా అందించారు. దాతలు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ఉప ప్రధానార్చకుడు కొడమంచిలి కొప్పేశ్వరరావు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున ఆలయ ఈవో నగేష్ అమ్మవారి ప్రసాదాన్ని, శేష వస్త్రాన్ని అందించారు.

సంఘ అభివృద్ధికి కృషి చేయాలి

తణుకు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సంఘ అభివృద్ధికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని తణుకు లేత్ అండ్ ఆర్క్ వెల్డింగ్ డిజైన్ వర్క్ ఓనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కె. శ్రీనివాసు అన్నారు. ఆదివారం సంఘ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో మరిన్ని సేవలు అందించే పాలకవర్గాన్ని ఎన్నుకోవాలని చెప్పారు. అనంతరం పలువురు సభ్యులను సత్కరించారు. అధ్యక్ష, కార్యదర్శులు మందూరి సురేష్, కడుపూడి చందరరావు, బళ్ళ నాని, త్రిమూర్తులు, కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



ఆకివీడు: ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని పతంజలి యోగాశ్రమ గౌరవధ్యక్షులు డాక్టర్ బలరామ్ ప్రతాప్‌కుమార్ అన్నారు. ఉగ్ర దాడిలో మృతి చెందిన వారికి ఆదివారం స్థానిక పతంజలి యోగాశ్రమంలో నివాళులర్పించి నినాదాలు చేసి మాట్లాడారు. యోగాసనాచార్య కందుల సత్యనారాయణ, కేంద్ర కార్యదర్శి కుంకట్ల సత్యనారాయణ, శిష్య బృందం ఉన్నారు. అదే విధంగా సీబీసీఎస్సీ ఆంధ్ర బాప్టిస్ట్ సెంటినరి టౌన్ చర్చిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులు పాల్గొన్నారు.

మృతుల ఆత్మశాంతి కోసం చర్చిలో ప్రార్థనలు

భీమవరం టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో జరిగిన మరణ హోమంకు ప్రపంచ మానవాళి దిగ్భ్రాంతి చెందిందని సెయింట్ పాల్ లూథరన్ దేవాలయం చినపేట పాస్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులకు నిరసనగా శాంతి ప్రార్థనలు నిర్వహించి మృతి చెందిన వారికి నివాళులర్పించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

దారేదీ?

జంగిల్ చానల్‌కు ఇరువైపులా రహదారి నిర్మాణానికి వినతి



మార్గంలేని రామన్నపాలెం జంగిల్ చానల్ గట్టు

మొగల్తూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం పంచాయతీ పరిధి జంగిల్ చానల్‌కు ఇరువైపులా మార్గం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొగల్తూరు మెయిన్ కెనాల్ నుంచి రామన్నపాలెం మీదుగా పేరుపాలెం వరకూ వెళ్ళే జంగిల్ చానల్‌కు ఇరువైపులా ఉన్న గట్లుకు రోడ్డు లేకపోవడంతో నిత్యం పొలాలకు వెళ్ళేందుకు రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామన్నపాలెం జంగిల్ చానల్ పరిధిలో సుమారు 400 ఎకరాల వరి దిగుబడులు, మామిడి ఫలసాయం రోడ్డు మీదకు తేవాలంటే ఈ చానల్ గట్టు మీద నుంచి ప్రయాణించాల్సి ఉందని, రైతులు, రైతు కూలీల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని జంగిల్ చానల్‌కు ఇరువైపులా ప్రభుత్వం లేదా మార్కెట్ యార్డ్ నుంచి నిధులు సమకూర్చి రహదారి నిర్మించాలని ఆయకట్టు రైతులు యాతం పాండురంగారావు, దూసనపూడి దొరబాబు, ముక్కు పుల్లయ్య నాయుడు తదితరులు కోరుతున్నారు.



భీమవరంలో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణంరాజు



కనకం ప్రసాద్ దంపతుల్ని సత్కరిస్తున్న దృశ్యం

పెరుగుతున్న గుండెపోటు మరణాలు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గుండె వ్యాధులపై అవగాహన ఉండాలని, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, వ్యసనాలకు దూరంగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుందని హైదరాబాద్ కేర్ ఆసుపత్రి కార్డియాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ పెన్మెత్స కృష్ణంరాజు అన్నారు. భీమవరంలో చైతన్య భారతి సంగీత, నృత్య, నాటక పరిషత్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 'గుండె చప్పుడు' అవగాహన సదస్సులో గుండె జబ్బుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ దేశంలో గుండెపోటు కేసులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్‌కే వర్మ, ఇరింకి కిషోర్, రాయప్రోల్ భగవాన్, భట్టిప్రోలు శ్రీనివాసరావు, బోండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణవర్మ, కె. సత్యనారాయణ, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

లివర్ వ్యాధులతో జాగ్రత్త..

నరసాపురం టౌన్: లివర్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని ప్రముఖ లాప్రోస్కోపిక్ సర్జన్ డి. వివేక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎన్ కళాశాలలో పీఎంపీ వైద్యులకు లివర్, 24 గంటల కడుపు నొప్పిపై అవగాహన సదస్సు నిర్వహించారు. 24 గంటల నొప్పిని చాలా మంది గ్యాస్ నొప్పిగా భావించి ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. ప్రజలకు గ్యాస్ నొప్పి, ఎపెండిస్ నొప్పులపై అవగాహన పెంచాలన్నారు. అనంతరం పీఎంపీ జిల్లా అధ్యక్షుడు కనకం ప్రసాద్ దంపతుల్ని సత్కరించారు. న్యూరో వైద్యులు స్పందన, పీఎంపీలు కుమార్, కుమారస్వామి, రామారావు, అర్జునుడు, అజీజ్‌లు పాల్గొన్నారు.

మత్స్యకారులకిచ్చిన హామీని అమలు చేసిన సీఎం

తణుకు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మత్సంమకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే సహాయాన్ని రెట్టింపు చేసి హామీను ప్రభుత్వం నిలబెట్టుకుందని చెప్పారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 1,29,178 మత్సకార కుటుం బాలకు రూ. 259 కోట్లు లబ్ధి చేకూరిందని వివరించారు. మత్స్యకారులకు నెలనెలా పించన్లు అందిస్తున్నట్లు తెలిపారు. వేట సమయంలో మరణిస్తే పది లక్షల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు.

జిమ్ పరికరాల మరమ్మతులు

పట్టణంలోని 20వ వార్డు పార్కులో ఉన్న జిమ్ పరికరాలకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. జిమ్ పరికరాలు మరమ్మతుకు గురవ్వడంతో ఎమ్మెల్యే ఆరిమిల్లి దృష్టికి తీసుకెళ్ళడంతో మున్సిపల్ అధికారు లతో చెప్పి వెంటనే మరమ్మతులు చేయించడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఆచంట: ఎన్నికల హామీ మేరకు వేట నిషేధ సమయంలో మత్స్యకారుల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం రెట్టింపు చేసిందని ఎమ్మెల్యే పితాని ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సాయం పెంచిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గత పాలకులు ఫిష్ ఆంధ్రా పేరుతో రూ. 300 కోట్లు ఖర్చుపెట్టామన్నారని ఒక మత్స్యకార కుటుంబం అయినా బాగుపడిందా అని ప్రశ్నించారు.

ఏకపక్షంగా ఇళ్ల తొలగింపు

ఉండి/పాలకోడేరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఇళ్ల తొలగిస్తామని ఉండి ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు ఏకపక్షంగా ప్రకటించడం సబబు కాదని ఇళ్ల తొలగింపుపై సమావేశాన్ని ఏర్పాటుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. ఆదివారం ఉండి చేరుకున్న సీపీఎం పాదయాత్రను ఉద్దేశించి మాట్లాడారు. ఇళ్ల కూల్చివేతపై కాలుష్య కారణాలు, పరిశీలన పేరుతో సీపీఎం ఆధ్వర్యంలో యాత్ర చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 800 ఇళ్ళు, 200ల షాపులను కాలుష్యం పేరుతో కూల్చివేశారని ఆరోపించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ధనికొండ శ్రీనివాస్, జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, ఉండి మండల కార్యదర్శి శేషగిరిరావు పాల్గొన్నారు. పాలకోడేరులో సీపీఎం యాత్ర ప్రారంభించారు.

అభివృద్ధిని చూసి మాట్లాడాలి

కాళ్ళ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి మాట్లాడాలని అనవసర విమర్శలు చెయ్యవద్దని సీపీఎం నేతలకు టీడీపీ నాయకులు హితవు పలికారు. కాళ్ళ మండలం జువ్వలపాలెంలో ఆదివారం డీసీ చైర్మన్‌లు తోట ఫణిబాబు, గోకరాజు వెంకట శివరామరాజు విలేకరులతో మాట్లాడారు. ఒక ఎకరా భూమికి కూడా నీటి ఎద్దడి లేకుండా పంటలు పండడానికి కారణం ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు ముందుచూపే అన్నారు. పంట, మురుగు కాలువలపై ఆక్రమణలు తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతన్నారని తెలపారు. ఇవేమీ పట్టకుండా అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారంటూ సీపీఎం నేతలు విమర్శలు చేయడం తగదన్నారు. మంతెన కోదండరామ రాజు, గొర్ల లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.



పెంటపాడు పోస్టుబేసిక్ పాఠశాల పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

పెంటపాడు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): 2005-06 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పెంటపాడు పోస్టుబేసిక్ పాఠ శాలలో కుటుంబాలతో సహా హాజరై ఆనందంగా గడిపారు. తమకు చదువు నేర్పిన గురువులను సత్కరించారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఏర్పాట్లను పూర్వ విద్యార్థులు చెరుకొండ జాన్‌బాబు, బర్ల ఫణీంద్రకుమార్, టేకు వెంకటరత్నం, సిరపు శిరీష, అశ్విని పర్యవేక్షించారు.

వంతెన మరమ్మతులు..

వాహనాల మళ్లింపు

ఆచంట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పెనుగొండ మార్టేరు రహదారి మధ్యలో నెగ్గిపూడి వద్ద కల్వర్టు నిర్మాణం నిమిత్తం ఆర్‌టీసీ బస్సులన్నీ పల్లెబాట పట్టాయి. దీంతో గ్రామాలు రద్దీగా మారాయి. నరసాపురం నుంచి రాజమండ్రి వెళ్ళే బస్సులు మార్టేరు ఆచంట, ములపర్రు, ఇలపర్రు, సిద్ధాంతం మీదుగా అలాగే నరసాపురం నుంచి తణుకు వెళ్లే బస్సులు అలమూరు, కంతేరు మీదుగా రూట్లు మార్పు చేశారు. దీంతో మార్టేరు నుంచి పెనుగొండ వాహనాలు వెళ్ళకుండా మార్టేరు వద్ద రోడ్డుకు అడ్డుకట్ట వేశారు. దీంతో ములపర్రు, కొడమంచిలి, ఆచంట, ఇలపర్రు వంటి గ్రామాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు అనేక ఆర్‌టీసీ బస్సులు వాహనాలతో రద్దీగా ఉండటంతోపాటు అపుడపుడు ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఎప్పుడూ లేని విధంగా ఇన్ని ఆర్‌టీసీ బస్సులు మన గ్రామం మీదుగా వెళ్తున్నాయేమిటోనని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. సుమారు 45 రోజులు పాటు ఆర్‌టీసీ బస్సులు ఈ రూట్‌లలో తిరగనున్నాయి.



నీలాద్రిపురంలో వేంకటేశ్వరుడి శోభాయాత్ర

ఘనంగా శోభాయాత్ర

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నీలాద్రిపురంలో శ్రీ నీలాద్రి వేంకటేశ్వరస్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా ఆదివారం కన్నుల పండువగా శోభాయాత్ర నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం గ్రామస్థులు పల్లకి వెంట నడిచి గ్రామంలో శ్రీ మార్లమ్మ, పుంతలో ముసలమ్మ అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చీర-సారె చలివిడి పానకాలు అందించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

మండపాకలో కల్యాణోత్సవం

తణుకు రూరల్: తణుకు రూరల్ మండపాకలో యర్నగూడెం శ్రీ వేంకటేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం రాత్రి మండపాక గ్రామానికి చెందిన కావలిపురపు బాలకృష్ణ, సౌజన్య దంపతుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. వేదపండితులతో పాటు భజన మండలి సభ్యులను సత్కరించారు. భజన మండలి అధ్యక్షురాలు గద్దే నాగమణి, బొల్లిన పద్మ, రోజా, పిన్నమనేని రత్నం, గద్దే లత, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పెనుమంట్ర: ఆదివారం, అమావాస్య, అశ్వినీ నక్షత్రాన్ని పురస్కరించుకుని జుత్తిగలోని ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామికి ఆలయ అర్చకులు వాసు శర్మ, వేద పండితుడువేమూరి ఫణీంద్ర శర్మ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించారు. పార్వతీ దేవికి కుంకుమార్చన నిర్వహించారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కి, కాలభైరవ స్వామి కి పంచామృత అభిషేకాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి మంత్రి నిమ్మల భూమిపూజ

రైతు సంక్షేమమే లక్ష్యం

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం వెలివెలి, చందపర్రు, ఆగర్తి పాలెం గ్రామాల్లో రూ.1.56కోట్లుతో చేపట్టనున్న గ్రావెల్ రోడ్లు, వంతెనలు, పూడికతీత పనులకు ఆదివారం శంకుస్థాపనలు చేసి శిలా ఫలకాలను ఆవిష్కరిం మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇరిగేషన్ వ్యవస్థను, వ్యవసాయ రంగాన్ని గాలి కొదిలేయడంతో నేడు సీఎం చంద్రబాబు ఈ రెండింటినీ గాడిలో పెట్టి రైతులకు అనేక కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. సంక్షేమం అభివృద్ధి ఈ రెండింటికీ కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. గ్రామాల్లో మంత్రి రామానాయుడుకు మహిళలు హారతులిచ్చి పూలవర్షం కురిపించారు. సర్పంచులు కందుల వెంకటేశ్వరరావు, కావలి లక్ష్మీకుమారి, పాలకొల్లు డీసీ చైర్మెన్ పెన్మెత్స రామభద్రరాజు, వైస్ చైర్మెన్ దేవళ్ల శ్రీరామకోటిమోహన్, పాలకొల్లు ఏఎంసీ చైర్మెన్ కోడి విజయభాస్కర్, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ పద్మారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఆక్వా రైతులతో మాట్లాడుతున్న గాంధీభగవాన్ రాజు

రొయ్య రైతులు

క్రాప్ హాలిడేకు సన్నద్ధమవ్వాలి

యలమంచిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులంతా మూడు నెలలు క్రాప్ హాలిడే ఇచ్చేందుకు సన్నద్ధమవ్వాలని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. జైభారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో చింతదిబ్బ గ్రామంలో కట్టుకాల్వ, మట్లపాలెం, చింతదిబ్బ, శిరగాలపల్లి గ్రామాల ఆక్వా రైతులతో గాంధీభగవాన్ రాజు శనివారం రాత్రి సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఫీడ్ రేట్లు గణనీయంగా పెరగడం, రొయ్య కౌంటు రేట్లు తగ్గడం, కౌంటుకు సరైన రేటు లేకపోవడం వల్ల ఆక్వా రైతులు తీవ్రమైన నష్టాలను చవిచూస్తున్నారన్నారు. సమావేశా నికి హాజరైన రైతులంతా క్రాప్ హాలిడేకు సంఘీభావం తెలిపారు. బోనం వెంకట నరసయ్య, బోనం రంగయ్య నాయుడు, మేడిది జాన్ రాజు, అంగర వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల సేవా కార్యక్రమం

తణుకు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేల్పూరు గ్రామ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలోని 11 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆదివారం వేల్పూరులో నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశంలో అడ్డా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కే సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్ చౌదరి, ఈగర ప్రసాద రావు తదితరులు పాల్గొని వేల్పూరు గ్రామ కమిటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. వేల్పూరు కమిటీ కోశాధికారి ఎం. సత్తిరాజు ఆర్థిక సాయంతో మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మా రికార్డులు.. మాకున్నాయి!

(ఐదో పేజీ తరువాయి)

గండి కొట్టిన చెరువుల్లో అసలు జిరాయితీ భూమి లేదని శాటిలైట్ సర్వే ద్వారా తెలుస్తోందని, ప్రభుత్వ భూమి ఉన్న చెరువులను స్వాధీనం చేసుకుంటున్నట్టు తెలిపారు. రైతులకు మూడు నెలల నుంచి గడువు ఇస్తూనే ఉన్నామన్నారు. అలాగే గండి కొట్టిన చెరువుల పరిధిలో చుట్టుపక్కల 780 మీటర్ల వరకు ఎటువంటి వరిపొలాలు లేవని, కొంతమంది కాల్వకు అడ్డుకట్ట వేయడం వల్ల నీరు ముందుకు వెళ్లే మార్గం లేక వెనక్కి ఎగదన్నిందని, మోటార్లు వేసి చేలో నీరు తోడించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే పత్సమట్ల

నీట మునిగిన పంట చేల రైతులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తానని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు హామీ ఇచ్చారు. నిడమర్రు శివారు ప్రాంతంలో చేపల చెరువులకు గండ్లు కొట్టడం వల్ల నీరు వరిచేలలోకి చేరడంతో బాధిత వరి రైతులను ఆదివారం ఆయన పరామర్శించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌లు ముగ్గళ్ళ యాకోబు, ఉమామహేశ్వరరావు, హరిబాబు పాల్గొన్నారు.

చాలా నష్టపోయాం..



నేను ఏడు ఎకరాలు చేను కౌలు తీసుకొని సాగు చేస్తున్నాను. మాకు ఎటువంటి సమాచారం అందించకుండా చెరువు గట్లకు గండి కొట్టడం వల్ల చాలా నష్టపోయాం. చేతికొచ్చిన పంట నీళ్ల పాలయింది. మా పంట సొమ్ము సుమారు 8 లక్షల రూపాయలు పంట నేల పాలయ్యింది. అటవీ శాఖాధికారులే పంట నష్టపరిహారం చెల్లించాలి.

- చెన్నుబోయిన వెంకన్న
వరి రైతు, పెదనిండ్రకొలను

ఇంటర్వ్యూ..

పంట కాల్వల్లో తూడు తొలగింపు

కొత్తపల్లి ఏడుకొండలరాజు, పాలకోడేరు నీటి సంఘం అధ్యక్షుడు



- **పాలకోడేరు నీటి సంఘం పరిధిలో కాలువల పరిస్థితి ఏమిటి?**
జవాబు: గత వైసీపీ హయాంలో పట్టించుకోకపోవడంతో కాలువలు, పంట బోదెలన్నీ అస్తవ్యస్తంగా మారాయి. ఏ పంట కాలువ, బోదె చూసినా చెత్తాచెదారం, తూడుతో ఇబ్బందికరంగా ఉన్నాయి.
- **మీ పరిధిలో ఎంత ఆయకట్టు ఉంది?**
జవాబు: పాలకోడేరు నీటి సంఘం పరిధిలో పాలకోడేరు, కుముదవల్లి గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలకు పైగానే ఆయకట్టు ఉంది.
- **ప్రస్తుతం పనులేమైనా చేపట్టారా?**
జవాబు: పాలకోడేరు నీటి సంఘం అధ్యక్షుడ్ని అయిన వెంటనే ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా, రైతులకు ఇబ్బంది లేకుండా పంట కాలువలు, పంట బోదెల్లో చెత్తాచెదారాన్ని తొలగించాం.
- **భవిష్యత్ కార్యాచరణ ఏమిటి?**
జవాబు: ప్రతి ఎకరాకు సాగునీటి ఇబ్బంది లేకుండా అన్ని కాలువలను, పంటబోదెలను పూర్తి స్థాయిలో బాగు చేయించి రైతులకు నిరంతరం నీరందించాలన్నదే లక్ష్యం.

(ఆంధ్రజ్యోతి-పాలకోడేరు)

భద్రతా వైఫల్యం వల్లే ఉగ్రదాడి : పాతపాటి

భీమవరం అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనికి భద్రతా వైఫల్యాలే కారణమని జిల్లా కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు పాతపాటి హరికుమార్ రాజు అన్నారు. భీమవరం జిల్లా కాంగ్రెసు పార్టీ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. బీజేపీ ఈ విషయాన్ని ఒక మతం మీద జరిగిన దాడిగా చూపించడం దాని అనుబంధ సంస్థ ఆర్ఎస్ఎస్ కూడా ఇదే పనిలో ఉండటం బాధాకరం అన్నారు. జిల్లా కాంగ్రెసు నాయకులు యడ్ల శివాజీ, పుచ్చకాయల రత్నంరాజు, కొర్రా శ్రీనివాస్ యాదవ్, కాశీ అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు 63 మంది హాజరు

నరసాపురం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలోని గురుకుల పాఠశాలలో ఆదివారం ఐదో తరగతి ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. పరీక్ష రాసేందుకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు విచ్చేశారు. మొత్తం 76 మందికి గాను 63 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షను ప్రిన్సిపాల్ శైలజ పరిశీలించారు.

మేకప్ ఆర్టిస్ట్ పరమేశ్వరరావు మృతి

భీమవరం అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణానికి చెందిన మేకప్ ఆర్టిస్ట్ డి. పరమేశ్వరరావు (65) ఆదివారం ఉదయం అనారోగ్యంతో ఇంటి వద్ద మృతి చెందారని ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు సీతారాం ప్రసాద్ తెలిపారు. పరమేశ్వరరావు 20 ఏళ్లుగా రాష్ట్రంలో సుమారు 200 నాటక సంస్థలకు వేలాది ప్రదర్శనలకు తన మేకప్ ద్వారా కళాకారులను తీర్చి దిద్దారన్నారు.

ధ్యాన సాధనతో మైత్రి భావన

పెనుమంట్ర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పత్రీజీ ధ్యానసాధన, సజ్జన సాంగత్యం ద్వారా తోటివారితో మైత్రి భావన కలిగి ఉండి సేవ చేయ గలుగుతామని సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎమ్. సుబ్బారావు అన్నారు. పెనుమంట్రలో భూపతిరాజు శ్రీనివాసరాజు దంపతులు నిర్మించిన ధ్యానమందిరం వద్ద కోనసీమ జిల్లా వడ్లమూరు కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎం. సుబ్బారావు జ్ఞానబోధ చేసి ధ్యాన శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను పుట్టుకతోనే కసాయి వృత్తి చేసే కుటుంబంలో జన్మించి అదే వృత్తి జీవనధారంగా చేసికుని జీవించేవాడినని పత్రీజీ ప్రబోధించిన శ్వాస మీద ధ్యాస ధ్యానసాధన ద్వారా జీవహింస వదలి అహింసా మార్గంలో ఉన్నానని తెలిపారు. అందరితో సామూహిక ధ్యానం చేయించారు. నిర్వాహకులు సుబ్బారావును ఘనంగా సత్కరించారు.

మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం

భీమవరంటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): లలిత కళలతోనే సామాజిక చైతన్యమని, మన దేశ కళలు ప్రపంచంలోనే గుర్తింపు పొందాయని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులఖండం కోటేశ్వరరావు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి అన్నారు. భీమవరం ఆర్యాపురం బ్యాంక్ వద్ద ఆదివారం స్వరసుధ మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఆర్గనైజర్ జి. చక్రవర్తి మాట్లాడుతూ ఈ ఇన్‌స్టిట్యూట్ లో సంగీత శిక్షణ, కీ బోర్డు, గిటార్, తబలా, కూచిపూడి నృత్యాలపై శిక్షణ ఇస్తామని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.